సాక్షి కామారెడ్డి

శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



కొనసాగుతున్న సమ్మె

అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- 9లో ▸



అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /22.0

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

27న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పీఎఫ్ చందాదారుల సమస్యలు పరిష్కరించేందుకు 27న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లిలోని వందేమాతరం స్కూల్‌లో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్ శ్రవణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా పాత రాజంపేట శాంతినికేతన్ విద్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పీఎఫ్ చందాదారులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: మాజీ సైనికులు రిటైల్ పెట్రోల్ పంప్ డీలర్‌షిప్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మాజీ సైనికులు ఈనెల 27లోగా https://www.petrolpumpdealerchayan.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అటవీ అధికారులపై దాడి

- రంగురాళ్లు తరలించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసే క్రమంలో ఘటన

రామారెడ్డి: రంగురాళ్లు తరలించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసే క్రమంలో అటవీశాఖ అధికారులపై రామారెడ్డి మండలం భట్టు తండాలో ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి శంకర్ దాడి ఘటనపై రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 31న రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న అటవీశాఖ అధికారులకు రంగురాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో పట్టుకునే ప్రయత్నం చేశారు. నిందితులు ఆరు రంగురాళ్ల సంచులను అక్కడే వదిలేసి ట్రాక్టర్‌తో సహా తప్పించుకుని పారిపోయారు. శుక్రవారం ట్రాక్టర్‌ను భట్టుతండాలో గుర్తించిన అటవీశాఖ అధికారులు సీజ్ చేసే క్రమంలో నిందితులు దూషిస్తూ కట్టెలతో దాడికి దిగారు. అధికారులకు గాయాలయ్యాయి. రాతుల కిశోర్, రాతుల మాన్‌సింగ్, రాతుల వనీత, రాతుల లావణ్య, రాతుల లలిత, అటవీశాఖ అధికారులను ట్రాక్టర్ సీజ్ చేయకుండా అడ్డుకున్నారు. సెక్షన్ ఆఫీసర్ శంకర్‌తో పాటు అటవీశాఖ అధికారులు శ్రీధర్, స్వరూప, సంతోష్, మరికొంత మందిపై దాడి దిగి గాయపరిచినట్లు శంకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.


మండలంగా రామడుగు

ధర్పల్లి: రామడుగు గ్రామాన్ని కొత్త రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి, సుద్దులం, ధర్పల్లి మండలంలోని రామడుగు, మైలారం, కేసారం, చల్లగర్గే, కొనాయిపల్లి గ్రామాలతో నూతన మండలాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

ఆఖ్రీ దకా!

రాజకీయం జూదం లాంటిదే.. ఒక్కసారి అడుగుపెట్టారంటే బయటకురావడం అంత ఈజీ కాదు. వరుసగా గెలుస్తున్నా.. ఓటములే ఎదురవుతున్నా రాజకీయాల నుంచి తప్పుకోవాలన్న ఆలోచనే రాదు.. జిల్లాలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన పలువురు నేతలు వయసు పైబడుతుండడానికి తోడు మహిళా రిజర్వేషన్ల ముప్పు ఉండడంతో ఈసారి గెలిచి తీరాలన్న తపనతో ఎవరికివారే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

- ఆ నేతలకిదే చివరి అవకాశం!
- ఓవైపు వయోభారం.. మరోవైపు మహిళా రిజర్వేషన్ల ప్రభావం
- గెలుపే లక్ష్యంగా సర్వశక్తులూ ఒడ్డుతున్న నేతలు



సాక్షి, కామారెడ్డి: జిల్లాకు చెందిన పలువురు నాయకులు దశాబ్దాలుగా రాజకీయాలలో కొనసాగుతున్నారు. ఎన్నికల బరిలో నిలవడమే కాదు.. పలుమార్లు విజయాలు సాధించి ఆయా నియోజకవర్గాలపై తమదైన ముద్ర వేసుకున్నారు. బాన్సువాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డిలో కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం వంటి నేతలు ఆయా నియోజకవర్గాలలో ఇప్పటికీ తమ పార్టీలకు పెద్ద దిక్కుగా ఉన్నారు. బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరు ఇప్పటికే ఖరారవ్వగా.. కామారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా షబ్బీర్ అలీ నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థిత్వం మరోసారి తనకే దక్కుతుందన్న ధీమాలో సౌదాగర్ గంగారాం ఉన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిన నేపథ్యంలో వచ్చే ఎన్నికలలో రిజర్వేషన్లు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి. మరోవైపు వయసు పెరుగుతుండడంతో ఇదే చివరి అవకాశంగా భావిస్తున్న నేతలు.. విజయం కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

గెలిచినా, ఓడినా జనంలోనే షబ్బీర్

మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అలీ షబ్బీర్ 1970 ప్రాంతంలో ఎన్‌ఎస్‌యూఐ నేతగా రాజకీయాలలోకి అడుగుపెట్టారు. తర్వాత యువజన కాంగ్రెస్ నేతగా రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1987లో జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో మాచారెడ్డి నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. రెండేళ్లకు అంటే 1989 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. తొలి దఫాలోనే ఆయనకు మంత్రిగా అవకాశం దక్కింది. 1994, 1999 ఎన్నికల్లో ఓడిపోయినా జనంలోనే ఉన్నారు. దీంతో 2004 లో భారీ మెజారిటీతో మరోసారి గెలిచి, దివంగత సీఎం వైఎస్సార్ మంత్రివర్గంలో కీలకమైన విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో తర్వాత 2014, 2018 ఎన్నికల్లోనూ వరుస ఓటములు చవిచూశారు. 2013 లో శాసన మండలి సభ్యుడిగా ఎన్నికై కొంతకాలం మండలిలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఓడినా, గెలిచినా జనం మధ్యే తిరుగుతున్న షబ్బీర్ అలీ.. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో శ్రమిస్తున్నారు. గెలుస్తానన్న ధీమాతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రకటించినప్పటికీ ప్రజలు తనను గెలిపిస్తారన్న నమ్మకంతో ఉన్నారు.

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గంగారాం..

చెప్పులుకుట్టే సాధారణ కుటుంబంలో జన్మించిన సౌదాగర్ గంగారాం నాలుగుసార్లు జుక్కల్(ఎస్సీ రిజర్వుడ్) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన గంగారామ్‌కు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోని పలువురు ముఖ్యమంత్రులతోనూ సాన్నిహిత్యం ఉండేది. 1983, 1989 లలో వరుసగా విజయం సాధించిన ఆయన.. 1994, 1999 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 2004లో మరోసారి గెలిచారు. 2009 లో తన భార్యను బరిలో నిలిపినా విజయాన్ని సొంతం చేసుకోలేకపోయారు. 2014, 2018 ఎన్నికల్లోనూ ఆయన ఓడిపోయారు. ఈసారి కూడా పార్టీ తనకే టికెట్టు ఇస్తుందన్న నమ్మకంతో ఉన్న గంగారాం.. గెలుస్తానన్న ధీమానూ వ్యక్తం చేస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు వయసుపైబడుతున్నా నవ యువకుల్లా తమ నియోజకవర్గాలను చుట్టేస్తూ జనంతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు.

ఐదు దశాబ్దాలుగా అలుపెరుగని పోచారం

బాన్సువాడ నియోజకవర్గంలోని పోచారం గ్రామానికి చెందిన పరిగె శ్రీనివాస్‌రెడ్డి 1978 లో సింగిల్ విండో చైర్మన్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. 1994 లో తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. అదే దఫాలో మంత్రిగానూ పనిచేశారు. 1999లో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది వివిధ శాఖల మంత్రిత్వ బాధ్యతలు నిర్వర్తించారు. 2004 ఎన్నికల్లో ఓటమి చవిచూసినా.. నియోజకవర్గాన్ని వీడలేదు. దీంతో 2009 లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. 2011 లో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరి ఉప ఎన్నికల్లో నిలబడి విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో గెలిచి మంత్రిగా ఐదేళ్లు కొనసాగారు. 2018 ఎన్నికలలోనూ గెలిచిన ఆయన.. ప్రస్తుత శాసనసభలో స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ఏడు పదుల వయసులోనూ ఆయన చురుకుగా పనిచేస్తున్నారు. ఈసారి పోటీ నుంచి తప్పుకుని కొడుకును బరిలో నిలపాలని అనుకున్నా.. సీఎం కేసీఆర్ సూచనలతో మరోసారి తనే రంగంలోకి దిగారు. వయసు పైబడుతున్నా లెక్క చేయకుండా నిత్య యువకుడిలా నిరంతరం జనంలో తిరుగుతున్నారు. ఈసారి మళ్లీ విజయం సాధించి స్పీకర్‌లు ఓడిపోతారన్న సెంటిమెంట్‌ను తిరగరాయాలన్న లక్ష్యంతో ఉన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బైరాపూర్, సంబాపూర్‌లలో డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రారంభం

బాన్సువాడ: నియోజకవర్గంలో ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే తన ఆశయమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం సంబాపూర్‌లో 25, బైరాపూర్‌లో 42 డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆయన ప్రారంభించారు. బైరాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పేదవారు ఏ పార్టీలో ఉన్నా డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేశామన్నారు. సర్కారు సొమ్మును దొంగల పాలు మాత్రం చేయలేదన్నారు. దేశంలోనే 11 వేల ఇళ్ల నిర్మాణం చేసిన ఏకైక నియోజకవర్గం బాన్సువాడ అని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అవినీతికి పాల్పడ్డారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 24 వేల ఇళ్లు కట్టినట్లు కాంగ్రెస్ నాయకులు రికార్డులు చూపించారని, అయితే తెలంగాణ రాష్ట్రం వచ్చాక విచారణ జరిపితే కొంతమంది అధికారులు ఉద్యోగాలు కోల్పోయారని, అవినీతి నాయకులు జైలుకు వెళ్లారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన డబ్బులతో ఎన్నికల్లో ఓట్లు కొనడానికి నాయకులు వస్తున్నారన్నారు.



బైరాపూర్‌లో ఇళ్లను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దోపిడీకి పాల్పడిన డబ్బులతో రాజకీయం చేయడానికి వస్తున్న నాయకులను గట్టిగా నిలదీయాలని ప్రజలను కోరారు. అనంతరం సంబాపూర్ గ్రామస్తులు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ చేసిన తీర్మాన పత్రాన్ని స్పీకర్‌కు అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో భుజంగరావు, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, నాయకులు శశికాంత్, కాశీరాం, దుంపల రాజు, శ్రీనివాస్‌యాదవ్, మేకల రవి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌కు కామారెడ్డి దెబ్బ తప్పదు'



కాంగ్రెస్‌లో చేరినవారితో షబ్బీర్ అలీ

భిక్కనూరు: ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు కామారెడ్డి ప్రజలు తమ దెబ్బ చూపిస్తారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం తిప్పాపూర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారులు బొర్రెడ్డి భాస్కర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నవీన్‌రెడ్డి నారాయణరెడ్డిలతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసి, కేసుల్లో ఇరుక్కున్న ఉద్యమకారులను బీఆర్‌ఎస్ పార్టీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తిప్పాపూర్ ఉద్యమకారులు పలువురు రైల్వే కేసుల్లో ఇరుక్కున్నారన్నారు. వారిని బీఆర్‌ఎస్ పట్టించుకోలేదని ఆరోపించారు. భాస్కర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎంతో నష్టపోయాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమకారులందరికీ సముచిత స్థానం కల్పించడంతో పాటు ఇళ్ల స్థలాలను ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, కాంగ్రెస్ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ చిట్టెడి సుధాకర్‌రెడ్డి, నాయకులు ధర్మయ్య పైడి సాయిరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, కొండ సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌కు గ్లోబల్ పీస్ అవార్డు

భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవితా తోరస్‌కు గ్లోబల్ పీస్ అవార్డు లభించింది. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా అమెరికాకు చెందిన సుబేదార్ అమీర్ అలీ ఖాన్ సంస్థ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రకటించింది. హైదరాబాద్‌లోని మురికివాడల ప్రజల సాధికారికతకు చేసిన కృషిని గుర్తించి తనను ఈ అవార్డుకు ఎంపిక చేశారని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవితాతోరస్‌ను సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



కవితా తోరస్

ఆసియా గేమ్స్‌కు 'ఇందూరు' బిడ్డలు!

- బాక్సింగ్‌లో తలపడనున్న నిఖత్ జరీన్
- ఫుట్‌బాల్ జట్టులో గుగులోత్ సౌమ్యకు చోటు

నిజామాబాద్‌నాగారం : ఆసియా క్రీడల్లో ఇందూరు కీర్తి పతాకం రెపరెపలాడనుంది. జిల్లా క్రీడాకారులు నిఖత్ జరీన్, గుగులోత్ సౌమ్య ఈ మెగా టోర్నీలో ఆడనున్నారు. పంచ్‌లతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ.. తనదైన శైలిలో పతకాలను సొంతం చేసుకుంటూ ముందుకు వెళ్తున్న నిఖత్.. చిరుతలా పరుగెడుతూ గోల్స్ కొట్టే ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య ఈ టోర్నీకి ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్ జౌన్ నగరంలో ఈ క్రీడలు జరగనున్నాయి.

మొదటిసారి పాల్గొంటున్నా



నేను మొదటి సారి ఆసియా గేమ్స్‌లో పాల్గొంటున్నా. ఈ టోర్నీలో ఆడటం నా కల. ఇందుకోసం చాలా కష్టపడ్డాను. గతంలో అంతర్జాతీయ టోర్నీల్లో ఆడే అవకాశం వచ్చినా, గాయాలతో ఇబ్బంది పడ్డాను. రెండు, మూడు టోర్నీలు మాత్రమే ఆడాను. ఈ టోర్నీలో సత్తా చాటుతా.

– గుగులోత్ సౌమ్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి

పతకం సాధిస్తా..

మొదటిసారి ఆసియా గేమ్స్‌లో పాల్గొంటున్నా. 50 కేజీల విభాగంలో బరిలో దిగుతున్నా. ఈ క్రీడల్లో పతకం సాధించి ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తా. దీనికోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా.

– నిఖత్ జరీన్, బాక్సింగ్ క్రీడాకారిణి



పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత

- మొత్తం 160 ఆలయాలకు రూ.10 కోట్లు మంజూరు
- భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయానికి రూ. 2 కోట్లు..
- చుక్కాపూర్ ఆలయానికి రూ. కోటి..
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నియోజకవర్గంలో పురాతన దేవాలయాల పునర్నిర్మాణం, నూతన ఆలయాల నిర్మాణాలు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో ఆలయాల అభివృద్ధికి సీడీపీ, ఎంపీ ల్యాడ్స్, ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి దేవాదాయశాఖ ద్వారా ఇప్పటివరకు రూ.38 కోట్లు మంజూరయ్యాయన్నారు. తాజాగా 160 ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం రూ. 10 కోట్లు మంజూరయ్యాయని, ఆయా పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించామని పేర్కొన్నారు. ప్రధానంగా దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వరాలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. బస్వాపూర్ శివాలయం పునర్నిర్మాణానికి రూ.25 లక్షలు, హనుమాన్ మందిరానికి రూ.15 లక్షలు, తిప్పాపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10 లక్షలు, మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ అభివృద్ధికి రూ. కోటి మంజూరయ్యాయన్నారు. మద్దికుంట బుగ్గరామేశ్వర ఆలయానికి రూ.10 లక్షలు, జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్డులో గల మార్కండేయ దేవాలయానికి రూ.25 లక్షలు, వేణుగోపాలస్వామి ఆలయానికి రూ. 5 లక్షలు కేటాయించామన్నారు. ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, లోయపల్లి నర్సింగ్‌రావు, జెడ్పీటీసీలు మిన్కూరి రాంరెడ్డి, ప్రేంకుమార్, నాయకులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

ఆలయాలకు యాదాద్రీశుడి నిధులు

యాదగిరిగుట్ట: కామారెడ్డి నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి రూ.5 కోట్ల నిధులు ఇవ్వాలని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి మరో రూ. 5 కోట్లు కేటాయించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఈనెల 14వ తేదీనే దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వుల కాపీని యాదాద్రి ఆలయాధికారులకు పంపించారు. అయితే ఈ విషయం కాస్త ఆలస్యంగా బయటకు వచ్చింది. ఆ ఉత్తర్వుల కాపీని సోషల్ మీడియాలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వైరల్ చేస్తున్నారు.

నిధుల తరలింపును ఖండించిన వీహెచ్‌పీ

యాదాద్రి ఆలయ నిధులను కామారెడ్డి నియోజకవర్గానికి తరలించడాన్ని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు కర్రె ప్రవీణ్ కుమార్ ఖండించారు. సీఎం కేసీఆర్ పోటీ చేయబోయే కామారెడ్డి నియోజకవర్గానికి యాదాద్రీశుడి ఆలయం నుంచి రూ.5 కోట్లు విడుదల చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దేవాలయాల నిధులను సీఎం కేసీఆర్ తన సొంత రాజకీయాలకు వాడుకుంటున్నారని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అభివృద్ధికి నోచుకోని దేవాలయాలు చాలా ఉన్నాయని, కావాలంటే ఈ జిల్లాలోని ఆలయాలకు యాదాద్రి ఆలయ నిధులు కేటాయించాలన్నారు. ఆలయ నిధులు తరలించాలని చూస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వృద్ధులను పోషించకపోతే చర్యలు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: వృద్ధులైన కుటుంబ సభ్యులను పోషించకపోతే వారి పిల్లలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వయోవృద్ధుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, అవసరమైనవారు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఇబ్బంది పెడితే జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వారి తల్లిదండ్రులను పోషించకపోతే వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. వృద్ధులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు. సమావేశంలో ఎస్సీ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సాయన్న, ఐసీడీఎస్ పీడీ బాబయ్య, కమిటీ ప్రతినిధులు రాజేశ్వరరావు, బైరయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు

దివ్యాంగులపై వివక్ష చూపిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దివ్యాంగుల హక్కుల చట్టం-2016 పై దివ్యాంగుల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులను గౌరవించే విధంగా ప్రభుత్వ కార్యాలయాలలో బోర్డులు ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. అర్హత గల వారందరికీ దివ్యాంగ పింఛన్లు ఇప్పిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలలో దివ్యాంగులకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పరికరాలు అందేలా చూడాలని కమిటీ ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు పోచవ్వ, సాయిలు, రాజమౌళి, నాగరాజు, బాలయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వంద శాతం పన్నులు వసూలు చేయాలి'



కామారెడ్డి రూరల్: గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శులకు డీపీవో శ్రీనివాస్‌రావు ఆదేశించారు. శుక్రవారం రాఘవాపూర్‌లో డీపీవో పర్యటించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సెప్టెంబర్ 30 వరకు వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీవో మలహరి, కార్యదర్శి సుమేధ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని దేశాన్ని నిర్మించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బాల్య వివాహాలు లేని దేశం నిర్మిద్దామని కమ్యూనిటీ మొబిలైజర్ ప్రీతి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేయవద్దని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం నేరమన్నారు. బాలల అక్రమ రవాణా జరిగినా, పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడినా సమాచారమివ్వాలన్నారు. తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు కనపడితే సాధన సంస్థ ప్రతినిధులను సంప్రదించాలన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



గాంధారి(ఎల్లారెడ్డి): పండుగలను భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దార్ జానకి, సదాశివనగర్ సీఐ రామన్ సూచించారు. స్థానిక హరాశే గార్డెన్స్‌లో శుక్రవారం గణేష్ మండపాల నిర్వాహకులు, వివిధ వర్గాలకు చెందిన గ్రామ పెద్దలతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్, సీఐ, గ్రామ పెద్దలు మాట్లాడారు. గణేష్ విగ్రహాల శోభాయాత్రను కూడళ్ల వద్ద ఎక్కువ సమయం నిలపకుండా వేగంగా తరలించి సకాలంలో నిమజ్జనం చేయాలని సూచించారు. సర్పంచ్ సంజీవు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తానాజీరావు, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్ పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

రాజంపేట: మండలంలో వినాయక శోభాయాత్రలకు డీజేలకు అనుమతి లేదని రాజంపేట ఎస్సై సంపత్ శుక్రవారం తెలిపారు. శోభాయాత్ర కార్యక్రమాలను శాంతియుతంగా జరుపుకోవాలని, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

సెల్ఫీ విత్ గణేశ్..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువ జన సంఘాల మండ పాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల కు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111



కారంగుల అంజల్‌రెడ్డి, 25వార్డు కౌన్సిలర్, కామారెడ్డి



పి.సతీష్, శ్రావణి, కామారెడ్డి



మమత, స్కైలాబ్, శ్రీకాంత్, బ్రాహ్మణపల్లి



భువనేష్, కామారెడ్డి



జి.హర్షవర్ధన్, కామారెడ్డి



దశరథ్ గౌడ్, కామారెడ్డి



చెన్నం రవీందర్, దోమకొండ



హనిష్, రాజు, కామారెడ్డి



మేఘన, అనుదీప్, భవిష్య, ఆరాధ్య, భానుతేజ, లింగాపూర్



చీకోటి బాలు, కామారెడ్డి



స్వరాజ్, మద్నూర్



సాయి హాసిని, బిచ్కుంద



రుత్విక్‌రెడ్డి, బాన్సువాడ



సందీప్ గౌడ్, భిక్కనూరు



శ్రావణి, రిత్విక్ చందు, కామారెడ్డి



అశోక్, బాన్సువాడ



రాజు, మద్నూర్



అంబం రుషి గౌతమ్, నెమ్లి, నస్రుల్లాబాద్

పరిష్కారం చూపని సర్వసభ్య సమావేశాలు

- రికార్డులకే పరిమితమవుతున్న తీర్మానాలు, నివేదికలు
- నేడు మండల సర్వసభ్య సమావేశం



బిచ్కుందలో మురికి కాలువలో చెత్తను తొలగిస్తున్న సర్పంచ్ భర్త (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమావేశంతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రజాప్రతినిధులు మే 31న జరిగిన సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలు నేటికి పరిష్కారానికి నోచుకోలేదు. అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడంతో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇద్దరి మధ్య సమన్వయ లోపంతో మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. సమస్యలు తీర్చండి మహాప్రభు అంటూ మొరపెట్టుకున్నా అధికారుల్లో చలనం లేదు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కరువయ్యాయి. శనివారం జరిగే మండల సర్వ సభ్య సమావేశంలోనైనా సమస్యలపై చర్చించి పరిష్కారం వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. 3 నెలల క్రితం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో శాంతాపూర్, సీతారాంపల్లి, మానేపూర్ గ్రామాలకు వస్తున్న మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోతుంది నెలలో 15 రోజులు మాత్రమే నీటి సరఫరా అవుతుందని ఎంపీటీసీలు, సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చినా నేటికి సమస్య పరిష్కారం కాలేదు. ప్రతిపాదనలు, తీర్మానాలు చేసినా అవి రికార్డులకే పరిమితం అవుతున్నాయి.. అభివృద్ధి మచ్చుకైనా కానరావడం లేదు. ఏ గ్రామానికి వెళ్లిన సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

ఆందోళనలో సోయా రైతులు

ప్రస్తుతం కురుస్తు అధిక వర్షాలతో సోయా పంటకు నష్టం వాటిల్లుతుంది. తెగుళ్లు ఆశించడంతో కాచిన కాయలలో గింజలు నిండకుండానే పూర్తిగా ఎండిపోతుంది. వచ్చిన పూత కాత రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏఈవోలు పంట క్షేత్రాలకు వెళ్లి సూచనలు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, మరమ్మతులు చేస్తున్న అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు జరిగే సమావేశంలోనైనా సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆలయాలతో విడదీయరాని బంధం మనది

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ప్రభుత్వవిప్

కామారెడ్డి రూరల్: మన జీవనంలో దేవాలయాలతో విడదీయనీ బంధం ఉందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులోని నల్లకుంట మైసమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన కమిటీ ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ గోవర్ధన్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో కామారెడ్డిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీని తీసుకొచ్చామన్నారు. కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని వారు ఏదో మాట్లాడితే మనం పట్టించుకోవద్దన్నారు. నా ఆహ్వానం మేరకు కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.28 కోట్లు దేవాలయాలకు ఖర్చు చేశామని, మరో రూ.10 కోట్లు కావాలని సీఎం కేసీఆర్‌ని కోరగా అవి కూడా మంజూరు చేశారన్నారు. అంతకుముందు నల్లకుంట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా మల్లాగౌడ్, డైరెక్టర్లుగా బొర్ర లలిత, గోపు శివకుమార్, పొన్నాల నర్సింలు, వేల్పుల కృష్ణలతో ప్రమాణ స్వీకారం చేయించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, ఎండోమెంట్ అధికారి శ్రీధర్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, లోయపల్లి నర్సింగ్‌రావు, మిన్కూరి రాంరెడ్డి, తిర్మల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. బిచ్కుంద కమ్మరి చెరువులో శుక్రవారం ఎమ్మెల్యే చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, చేపలు ఇతర ప్రాంతాలకు తరలించడానికి వాహనాలు ఇచ్చామని పేర్కొన్నారు. 95,400 చేప పిల్లలను విడుదల చేసినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల కులవృత్తుల అభివృద్ధి కోసం ప్రభుత్వం లక్షల నిధులతో ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సొసైటీ చైర్మన్ బాలు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొన్నారు. బిచ్కుందలో టాక్సీ డ్రైవర్లు ప్రతిష్ఠించిన గణపతి మండపానికి వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తిభావం పెంపొందించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎల్లారెడ్డి: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమాధికారి బావయ్య అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి సీడీపీవో కార్యాలయంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని, ఓటును ప్రతి ఒక్కరు వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, సీడీపీవో సరిత తదితరులున్నారు.



ఊరూరా.. మేరీ మాటీ మేరా దేశ్



పొందుర్తిలో మట్టిని సేకరిస్తున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

రాజంపేట: కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్మించబోయే అమరవీరుల స్మృతివనం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు పొందుర్తి, శివాయిపల్లి, పెద్దయిపల్లి, తలమడ్ల, ఆరేపల్లి గ్రామాలలో అమృత కలశంలో మట్టిని సేకరించినట్లు బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర సమరయోధులు, సైనిక అమర వీరుల త్యాగాలకు గుర్తుగా దేశ రాజధానిలో నిర్మించే స్మృతి వనం కోసం దేశం మొత్తం గ్రామాల నుంచి మట్టి సేకరణ కార్యక్రమం దేశ ప్రధాని నరేంద్రమోదీ గారు చేపట్టారని అందులో భాగంగా మట్టి సేకరిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు గంగారెడ్డి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ పరిధిలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బేగంపూర్, బేగంపూర్ తండా, కాస్లాబాద్, పెద్ద దేవిసింగ్ తండాలలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార ఆధ్వర్యంలో మట్టి సేకరించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కాలకుంట్ల రాము, మండల అధ్యక్షులు బాలాజీ పటేల్, నాయకులు సంజీవ్ పటేల్, అశోక్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వ్యాపారులపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని పవన్‌టాకీస్ వెనుక ప్రాంతంలో ముగ్గురు గంజాయి వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి కిలో ఎండు గంజాయి, రసాయనాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పోలీసులకు చైన్‌స్నాచర్ అప్పగింత

ఖలీల్‌వాడి : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌సమీపంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన మేరకు వివరాలు.. ఇందల్వాయి మండలం లోలం గ్రామానికి చెందిన ఏశాల స్వప్న నగరంలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చింది. తిరుగు ప్రయాణంలో బస్టాండ్ వద్ద పండ్లు కొనుగోలు చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని చైన్‌ను దొంగిలించే ప్రయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్లకు చెందిన మహ్మద్ మొయినొద్దీన్ చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడని, అతడిని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఇందల్వాయి: సిర్నాపల్లి రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన రాంసారం బాబయ్య, బొమ్మిని చరణ్ బైక్‌పై ఇందల్వాయి నుంచి సిర్నాపల్లికి వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా బాబయ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డ్ మృతి



లింగం (ఫైల్)

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన హోంగార్డ్ లింగం(50) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నవీపేట పీఎస్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న లింగం కొంత కాలంగా బీపీ, షుగర్, కాలేయ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు?

సిరికొండ: మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న కత్తిపోట్ల ఘటనలో పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్సర్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ అసద్‌తో పాటు నిజామాబాద్‌కు చెందిన రహమాన్ తదితరులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ధర్పల్లి సీఐ సైదాను వివరణ కోరగా దాడి కేసుపై విచారణ చేపడుతున్నామని ఘటనతో సంబంధం ఉన్న వారందరిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు.

పలువురిపై కేసు నమోదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తాడ్వాయి పోలీసులు రవి, నిరంజన్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల శివారులో గాంధారి మండలంలోని గుడిమెట్‌కు చెందిన ఆర్ల శివాజీ, బొంపల్లికి చెందిన హరీశ్ మరికొందరు కారు ఆపి మద్యం సేవిస్తున్నారు. రోడ్డు పక్కన మద్యం తాగొద్దని వారికి సూచించారు. దీంతో శివాజీరావు, హరీశ్ పోలీసులను బెదిరించి నెట్టివేశారు. కానిస్టేబుల్ రవి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేయగా మరొకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

భిక్కనూరు: వృద్ధురాలిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గోసు ఎల్లవ్వ (75) ఆరోగ్య నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చూయించుకొని ఇంటికి వెళ్తుండగా కరీంనగర్ నుంచి బస్వాపూర్ మీదుగా వెళ్తున్న ఓ సిమెంట్ లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో ఎల్లవ్వ ఘటన స్థలిలోనే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. టోల్ పన్ను ఎగ్గొటేందుకు పలు పెద్ద వాహనాలు ఇదే ప్రాంతంలో సంచరిస్తున్నాయని వీటిని అధికారులు నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..


బిచ్కుంద(జుక్కల్): మండలంలోని సీతారాంపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మణ్‌జాదవ్ (40) తన పొలంలో పంటను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెపై పడడంతో మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంటలో పడి ఒకరు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్‌కు చెందిన ఒకరు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన సుంకరి బాలయ్య(55) కాలకృత్యాలు తీర్చుకునేందుకు కుంటకు వెళ్లగా కాలుజారి పడిపోయి మృతి చెందాడు. మృతుడి భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పండుగకు వస్తుండగా ప్రమాదం

- చికిత్స పొందుతూ యువకుడి మృతి



అఖిల్ (ఫైల్)

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన అఖిల్(23) హైదరాబాద్‌లోని దుండిగల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా దుండిగల్ ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏఎస్సై లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకొని అఖిల్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అఖిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మర్కల్‌లో ఒకరు..

సదాశివనగర్: మండలంలోని మర్కల్ గ్రామంలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మర్కల్‌కు చెందిన బండారి రవి(37) గొర్లను మేపుతూ గ్రామ సమీపంలోని చెరువు కట్టపై వెళ్తుండగా అకస్మాత్తుగా తేనేటీగలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికితస పొందుతూ రవి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన జీపీ కార్మికుడు పరశురాం (30) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. కొన్నేండ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్న పరశురాం గదిలో నిద్రించగా భార్య సుజాత కొద్ది సేపటికి వెళ్లి చూసే సరికి ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువకుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఫేస్‌బుక్



ఖలీల్‌వాడి: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువకుడిని ఫేస్‌బుక్ ప్రొఫైల్ పిక్ తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. ప్రొఫైల్ పిక్ మార్చడంతో పోలీసులు యువకుడిని పట్టుకున్న ఘటన నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ 18 నెలల క్రితం అదృశ్యమయ్యాడు. హైదరాబాద్‌లో ఇంటర్ కాలేజీకి వెళ్తూ కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తాజాగా ఆ యువకుడు ఫేస్‌బుక్‌లో ప్రొఫైల్ పిక్ మార్చడంతో పోలీసులు సాంకేతిక సాయంతో ప్రయత్నాలు చేపట్టారు. ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేయగా ఖమ్మంలో ఉన్నట్లు గుర్తించి విష్ణువర్ధన్‌ను పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

కోళ్లఫారంలో చోరీ

ఆర్మూర్‌టౌన్: మండల సమీపంలోని బాలాజీ కోళ్ల ఫారంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటర్లను గురువారం రాత్రి చోరీ చేశారు. కోళ్లఫారంలో గ్రైండింగ్ మిషన్‌కు సంబంధించిన 5 హెచ్‌పీ, 2హెచ్‌పీ, 1హెచ్‌పీ మోటార్లను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రాజేంద్రగౌడ్ తెలిపారు. సుమారు రూ. లక్ష విలువ చేసే సామన్లను అపహరించినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీకి చెందిన షేక్ రబియాబీ (70) అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు. ఈ నెల 15న పింఛన్ డబ్బులు తెచ్చుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.